'పది'లో వంద శాతం ఫలితాలు సాధించాలి

పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చిన్నగూడూరు ఫిబ్రవరి 14 : పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ లెనిన్ వస్త్రాల్ టోప్పో సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, పరిసరాలను పరిశీలించారు. మన ఊరు మనబడిలో చేపట్టిన పనులపై ఆరా తీశారు. రోజువారీ నైపుణ్యం పరీక్షలు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మెరుగైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంతఈవో రవికుమార్, తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎంపీడీవో రామారావు, ఇన్‌చార్జి హెచ్ఎం రహమాన్ పాల్గొన్నారు.

కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి

జంటను సన్మానిస్తున్న గుగులోత్ కిషన్ నాయక్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : కుల, మతాంతర వివాహాలను ప్రోత్సహించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కుల, మతాంతర వివాహాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కుల వ్యవస్థ కేవలం మనదేశంలోనే ఉందన్నారు. కుల, మతాంతర వివాహాలు చట్ట విరుద్ధం కాదన్నారు. మతం కంటే మానవత్వం గొప్పదని, కుల దుహంకారం వీడి సమాజంలో అందరూ కలిసి ఉండాలన్నారు. అనంతరం కులాంతర వివాహాల జంటలను సన్మానించారు. సాదుల శ్రీనివాస్, దుడ్డెల రామ్మూర్తి, చీపిరి యాకయ్య, ప్రశాంత్, నాగరాజు, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, గణేశ్ పాల్గొన్నారు.

పరస్పర దాడుల్లో నలుగురికి గాయాలు

మరిపెడ, ఫిబ్రవరి 14 : వ్యక్తిగత కక్షలతో రెండు కుటుంబాల మధ్య పరస్పర దాడులు చేసుకోవడంతో నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన మరిపెడ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని బావోజిగూడేనికి చెందిన భీమనపల్లి ఈశ్వర్, దిగజార్ల వీరన్న ఊరిలో జరిగిన ఒక దశదినకర్మ వెళ్లగా అక్కడ ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రెండు కుటుంబాల మధ్య వైరం ఎక్కువ కావడంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశారు. అయితే, బయటకు వచ్చిన రెండు వర్గాల వారు మధ్య పెట్రోల్ బంకు వద్ద మళ్లీ తారసపడడంతో ఘర్షణ మొదలైంది. ఈ క్రమంలో గ్రూపులుగా ఏర్పడి పరస్పరం దాడి చేసుకున్నారు. పోలీసులకు సమాచారం అందడంతో హుటాహుటిన చేరుకొని వారిని శాంతింపజేశారు. కాగా, దాడుల్లో దిగజార్ల వీరన్న, నామాల సతీశ్, దిగజార్ల సుధాకర్, భీమనపల్లి ఈశ్వర్‌కు గాయాలు కావడంతో వారిని దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి రెడ్యా పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

డోర్నకల్ ,ఫిబ్రవరి 14 : చిలుక్కోయల పాడు గ్రామానికి చెందిన రైతు, బీఆర్ఎస్ నాయకుడు గజ్జి రమేశ్ ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యా నాయక్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ యలమద్ది మన్మథరావు, మాజీ ఎంపీటీసీ విజయ్ పాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు ఉడుగుల వీరన్న, ఉడుగుల వీరభద్రం, సూరబోయిన పాపయ్య, గజ్జి మల్లేశం, పిట్టల శ్రీను, బానోత్ మాన్య ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

కేసముద్రం, ఫిబ్రవరి 14 : ఇటీవల అనారోగ్యంతో ధన్నసరి ఆర్ఎంపీ గోపాల వెంకట్‌రెడ్డి మృతిచెందగా బాధిత కుటుంబానికి ఆర్ఎంపీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రూ.36వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్రాచారి, కార్యనిర్వాహక అధ్యక్షుడు మహ్మద్ నజీర్ అహ్మద్, ఆర్ఎంపీలు పిల్లి శ్రీనివాస్, ఏకాంతం, భాస్కర్, వెంకట్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

★ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime Schoolకు ఎదురుగా గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666/8309035091
NTW-27793

WANTED

jobs Apply Now!

★ Wanted PRO's / Agents for MBBS, B.Tech Abroad Admissions. Contact Immediately Cell: 8121554649
NTW-326594

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

GOLD FINANCE

★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

'ఆధార్' కోసం ప్రజల అవస్థలు

- కిటకిటలాడుతున్న నమోదు కేంద్రాలు
- గంటల తరబడి క్యూలో నిరీక్షణ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మహబూబాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): ఆధార్ కార్డుల కోసం ప్రజలు ఎండలో అష్టకష్టాలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను మీసేవ ద్వారా స్వీకరిస్తున్నది. ఇప్పటికే ప్రజా పాలన, కులగణన సర్వే, గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తులు ఇచ్చిన వారు సైతం మీసేవ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటున్నారు. గతంలో ఆధార్ కార్డు దిగినప్పుడు ఐదేళ్ల లోపు పిల్లలకు ఐరిష్, వేలిముద్రలు తీసుకోలేదు. ఇప్పుడు వారి ఐరిష్, వేలి ముద్రలు, పుట్టిన తేదీ తదితర వివరాలను అప్డేట్ చేస్తున్నారు. ఆధార్ కార్డులను సరి చేసుకున్న తర్వాతే రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని మీసేవ నిర్వాహకులు ప్రజలకు సూచిస్తున్నారు. అదేవిధంగా కొత్తగా పెళ్లయిన జంటలు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్‌లో ఇంటి పేరు, చిరునామా మార్చుకుంటున్నారు. వీటికి తోడు కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం కొత్తగా అపార్ తీసుకొచ్చింది. వీటి కోసం కూడా విద్యార్థులు ఆధార్ సెంటర్‌ల వద్ద క్యూ కడుతున్నారు. దీంతో ఆధార్ కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. చాలా సేపు క్యూలో నిలబడాల్సి వస్తున్నది. ఒక్కొక్కరికి కనీసం ఐదు నుంచి పది నిమిషాల వరకు సమయం పడుతుండడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు. వీటికి తోడు ఆధార్ కేంద్రాల వద్ద సిగ్నల్, సైట్ సరిగా పని చేయక కూడా మరింత ఆలస్యం జరుగుతున్నది. ముఖ్యంగా ఆధార్ కేంద్రాలకు కొత్తగా రేషన్ కార్డులు తీసుకోవాలనుకునే వారు ఎక్కువగా వస్తున్నారు. దీంతో అక్కడ సమస్య వస్తున్నది. ఆధార్ కేంద్రాల వద్ద ప్రజలు గంటల తరబడి నిరీక్షించక తప్పడం లేదు. ఇప్పటికైనా తాత్కాలికంగా మరిన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గ్రానైట్ లారీ బోల్తా పడి ఒకరి మృతి

డోర్నకల్, ఫిబ్రవరి 14 : గ్రానైట్ లారీ బోల్తా పడి ఒకరు మృతి చెందిన ఘటన రామముతం డాలో శుక్రవారం చోటు చేసుకుంది. ముదిగొండ సీఐ మురళీ కథనం ప్రకారం.. నేలకొండపల్లి నుంచి ఖమ్మం వైపు వస్తున్న గ్రానైట్ లారీ ప్రమాదవశాత్తు టైర్ బోల్ట్ ఊడి పోవడంతో బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న డోర్నకల్ మండలం రాము తండాకు నునవాత్ వీరన్న(36)పై గ్రానైట్ పాలిష్ రాళ్లు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య భార్గవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉగ్గంపల్లి ఘటనపై విచారణ?

నర్సింహులపేట, ఫిబ్రవరి 14 : క్రీడల కోసం వెళ్లిన మండలంలోని పాఠశాలకు చెందిన విద్యార్థులపై ఇటీవల చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలో ఆకతాయిలు అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై అధికారులు విచారణ జరుపుతున్నారు. విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించడం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉగ్గంపల్లి ఘటనపై ఈ నెల 11న 'నమస్తే'లో వచ్చిన కథనంతో డీఈవో స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం పాఠశాలలో విద్యార్థినులను రెండు గంటల పాటు ఓ మహిళా అధికారి విచారించినట్లు సమాచారం. రోజుకో అధికారి విచారణ జరుపుతుండడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ఇద్దరు శతాధిక వృద్ధుల మృతి

నరహరి, భద్రయ్య(ఫైల్)

కురవి, ఫిబ్రవరి 14 : నీరోలు మండలంలో ఇద్దరు శతాధిక వృద్ధులు మృతి చెందారు. ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన మండలోజు నరహరి(107), కాంపల్లికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు గోల్కొండ భద్రయ్య(104) శుక్రవారం మృతిచెందారు. నరహరికి కుమార్తె ఆకోజు శాంతమ్మ ఉండగా, భద్రయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

దుబ్బ తండాలో ఒకరి అదృశ్యం

మాలోత్ దంజ్యా

దంతాలపల్లి, ఫిబ్రవరి 14 : ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు కథనం ప్రకారం.. మండలంలోని తూర్పుతండా శివారు దుబ్బ తండాకు చెందిన మాలోత్ దంజ్యా(50) మానసిక దివ్యాంగుడు. ఈ నెల7న ఇంట్లోనుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో దంజ్యా తండ్రి మాలోత్ దాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మార్కులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

పదో తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన

మరిపెడ, ఫిబ్రవరి 14 : మండలంలోని పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను అధికారులు శుక్రవారం పరిశీలించారు. గుండెపూడి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మరిపెడ జ్యోతిబా పూలే పాఠశాల, మరిపెడ, తానంచర్ల పాఠశాలల్లో విద్యార్థుల మార్కులను పరిశీలించి, ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో అనితాదేవి, హెచ్ఎంలు మురళీకృష్ణ, అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న పడమటిగూడెంవాసులు

అమర జవాన్లకు నివాళి

నర్సింహులపేట, ఫిబ్రవరి 14 : పూల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు శుక్రవారం మండలంలోని పడమటిగూడెం గ్రామంలో గ్రామస్తులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వారి త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత

ఒకరిపై కేసు నమోదు

కేసముద్రం : రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

కేసముద్రం, ఫిబ్రవరి 14 : మండలంలోని రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఆర్ఐ బాబు తెలిపారు. మహిమూద్‌పట్నం గ్రామంలోని వీరాంజనేయ రైస్ మిల్లులో రేషన్ బియ్యం నిల్వ చేశారనే సమాచారం మేరకు సివిల్ సప్లయిస్, విజిలెన్స్ అధికారులతో కలిసి తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. 36 బస్తాల్లో 25 క్వింటాల్ రేషన్ బియ్యాన్ని మిల్లులో నిల్వ చేసి, 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చినట్లు తెలిపారు. మండలంలోని కోమటిపల్లి బావోజీ తండాకు చెందిన రేషన్‌డీలర్ శాంతి నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి నూకలుగా మార్చి అమ్ముకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు మిల్లు యాజమాని అయిలయ్యపై కేసు నమోదు చేసినట్లు ఆర్ఐ పేర్కొన్నారు. తనిఖీల్లో సివిల్, విజిలెన్స్ అధజకారులు ప్రేమ్‌కుమార్, రమేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కోమటిపల్లిలో రేషన్ షాప్ సీజ్

ఇనుగుర్తి : మండలంలోని కోమటిపల్లిలోని రేషన్ షాప్‌ను శుక్రవారం జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్ సీజ్ చేశారు. ఆర్ఐ నరసింహారావు కథనం ప్రకారం.. కోమటిపల్లిలోని 3107024 నంబర్ రేషన్ షాపులో తనిఖీలు చేయగా రికార్డులకు మించి 7.05కింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు తేలింది. కొంతకాలంగా ప్రజల నుంచి రేషన్ డీలర్ నేరుగా బియ్యం కొనుగోలు చేసి, రైస్ మిల్లర్లకు అక్రమంగా అమ్ముతున్నారనే పక్కా సమాచారంతో జిల్లా అధికారులు దాడులు నిర్వహించినట్లు ఆర్ఐ తెలిపారు.

కనీస ధరకు మిర్చి కొనుగోలు చేయాలి

మిర్చి కల్లాన్ని పరిశీలిస్తున్న నల్లు సుధాకర్‌రెడ్డి

కురవి, ఫిబ్రవరి 14 : మిరప పంటను మార్క్‌ఫెడ్, నాఫెడ్ ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కనీస ధరకు కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం శివారులోని మిరప కల్లాలను సీపీఐ బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మిరప పంట సాగుకు రైతులు ఎకరానికి రూ.1.50లక్షల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. తీరా పంటను మార్కెట్‌కు తీసుకొస్తే రూ.10వేలకే క్వింటా కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు విలవిలలాడుతుంటే ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం విచారకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో క్వింటా మిర్చి రూ.25వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, గజ్జి చంద్రయ్య, జిన్నె సూర్యనారాయణ, కందుల శరత్ పాల్గొన్నారు.

మహిళా న్యాయమూర్తిపై దాడి దారుణం

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తొర్రూరు, ఫిబ్రవరి 14 : రంగారెడ్డి జిల్లా కోర్టులో మహిళా న్యాయమూర్తిపై ముద్దాయి దాడి చేసిన ఘటన న్యాయవ్యవస్థకు తీవ్ర అవమానమని బార్ అసోసియేషన్ నేతలు అన్నారు. ఇటీవల న్యాయవాదులపై దాడులకు వ్యతిరేకంగా ప్లకార్డులతో శుక్రవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కలువకొలను ప్రవీణ్ రాజు, జనరల్ సెక్రటరీ ఆర్కే ఘనపురం మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదులపై నిత్యం జరుగుతున్న దాడులు అమానవీయమన్నారు. బాధ్యులైన వారిని తక్షణమే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బండపల్లి వెంకన్న, వల్లపు మహేశ్, వెంకటేశ్వర స్వామి, రఘురామ్‌రెడ్డి, వల్లపు అయిలోని, బానోత్ లాలు, బాషిపంగు వెంకటేశ్వర్లు, క్రుపావతి, యాకేందర్, నర్కుటి గోపాల్, విజయ, గంపల ప్రవీణ్, సూరెపల్లి శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

మరిపెడ : మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం

ఆరోగ్యం-పోషణపై మహిళ లకు శిక్షణ

పెద్దవంగర/మరిపెడ, ఫిబ్రవరి14 : తులసి మండల సమాఖ్య కార్యాలయంలో ఎమ్మెస్ ఓబీ లీడర్లు, వీవో అధ్యక్షులు, సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులకు ఆరోగ్యం- పోషణపై శుక్రవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఏపీఎం రమణాచారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొని ఆహారం, ఆరోగ్యం, హానికరమైన అలవాట్లు, లింగ సమానత్వం గురించి వివరించారు. సీసీలు జీ సుధాకర్, ఎస్ సుజాత, ఎం పద్మమ్మ, బీ సుధాకర్, ఎంఎస్ఏ ఆశలత, ఆపరేటర్ అనిల్, ఎమ్మెస్ కార్యదర్శి భద్రమ్మ, కోశాధికారి స్వాతి, వీవో అధ్యక్షులు, సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే, మరిపెడ మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో మండలంలోని డ్వాక్వా మహిళలకు ఏపీఎం రాములు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

దంతాలపల్లిలో ప్రచారం చేస్తున్న అభ్యర్థి వెంకటస్వామి

పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలి

దంతాలపల్లి, ఫిబ్రవరి 14 : కేంద్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని టీఎస్ సీపీఎస్ ఈయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కొలిపాక వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూపీఎస్ కార్పొరేట్ వ్యవస్థను బతకించడానికే తప్ప ఉద్యోగ ఉపాధ్యాయులకు మేలు చేయదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మణుగూరు హాల్టింగ్ పునరుద్ధరించాలి

గార్ల, ఫిబ్రవరి 14 : గార్ల రైల్వే స్టేషన్‌లో మణుగూరు ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌ను పునరుద్ధరించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో శుక్రవారం జీఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైలు హాల్టింగ్‌కు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

డీసీసీబీ, పీఏసీఎస్‌ల పదవీకాలం పొడిగింపు

హనుమకొండ, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలోని పీఏసీఎస్, డీసీసీబీ పాలకవర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలలు పొడిగిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, డీసీసీబీ చైర్మన్లు సత్తయ్య, రమేశ్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బోజారెడ్డి, వెంకటేశ్వరరావు, టీజీ క్యాబ్ ఎండీ గోపితో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ సహకార సంఘాల పదవీకాలం పొడిగించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు రేషన్ డీలర్‌షిప్ ఇవ్వాలి

దంతాలపల్లి, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్‌షిప్‌ను దివ్యాంగులకు కేటాయించాలని గ్రామానికి చెందిన దివ్యాంగులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. దంతాలపల్లికి చెందిన రేషన్ షాపు-1 డీలర్ గుట్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన స్థానంలో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

గూడూరు, ఫిబ్రవరి 14: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పేదలకు ఇళ్లు మంజూరు చేసి, రైతు భరోసా, పింఛన్లు పెంచాలన్నారు. అచ్చన్న, లింగన్న, తిరుపతమ్మ, భరత్, వజ్జయ్య, సమ్మన్న, వెంకన్న పాల్గొన్నారు.

సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేస్తున్న గిరిజనులు

ఘనంగా సేవాలాల్ జయంతి

గూడూరు, ఫిబ్రవరి 14 : మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఎన్టీవీఎస్, టీబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం లంబాడీ గిరిజనుల ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత పాల్గొని సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. సేవాలాల్ మహారాజ్ చూపిన బాటలో గిరిజన యువత పయనించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరస్వామి, ఎస్సై గిరిధర్‌రెడ్డి, పరశురాములు, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ నునావత్ రమేశ్‌నాయక్, వెంకన్న, కొమ్మాలు, శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని టీజీఎన్పీడీసీఎల్ వరంగల్ చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలాచారి అన్నారు. శుక్రవారం పట్టణంలో టౌన్-1, 2, రూరల్ పరిధిలోని ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, జేఎల్ఎంలకు విద్యుత్ సరఫరాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలాచారి మాట్లాడుతూ వేసవిలో ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి లూజ్ వైర్లు, ఇంటి మీద నుంచి పోయే లెవన్ కేవీ వైర్లు, మీటర్ బిల్లు సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీజీఎన్పీడీసీఎల్ టెక్నికల్ మెంబర్ రమేశ్, చరణ్‌దాస్, రామారావు, ఏసీ నరేశ్, డీఈ విజయ్ కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

నేడు తొర్రూరులో విద్యుత్ అంతరాయం

తొర్రూరు, ఫిబ్రవరి 14 : మూడో శనివారం సందర్భంగా తొర్రూరు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ చలపతిరావు తెలిపారు. వేసవి దృష్ట్యా మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్ఎస్ఎస్ క్యాంపులో లావణ్య ప్రతిభ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వైఎన్ రావు కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ క్యాంపులో స్థానిక తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థిని లావణ్య ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంది. ఈ సందర్భంగా లావణ్యను ప్రిన్సిపాల్ బిందు మాధవి, అధ్యాపకులు అభినందించారు.